ఆహా పులీ కథ

వసుంధర



రాజమండ్రి రైల్వేస్టేషన్లో కుటుంబ సమేతంగా దిగాను. వైభవాన్ని సూచించే వీఐపీ చక్రాల పెట్టెల్ని దొర్లించుకుంటూ స్టేషన్లోంచి బైటకు వచ్చి రిక్షా బేరమాడాను.

నల్గురు పెద్దవాళ్ళు, ఇద్దరు పిల్లలు—మూడు పెట్లు ఉన్నాయి. మూడు రిక్షాలు సరిపోతాయి. ఇలా నేను లెక్కవేసుకుంటూండగా రిక్షా అతను—“అయిదు రూపాయలవుతుందండి—” అన్నాడు.

—“మొత్తం మా అందరికీనా?” అనడిగాను.

“కాదండి—ఒకోరిక్షాకి—” రిక్షా అతను బదులిచ్చేడు.

“ఏమిటీ! స్టేషన్నించి బొబ్బర్లంక లాంచీల రేవుకి అయిదు రూపాయలా?” అన్నాను. ఈ మాటలు మామూలుగా పైకి వచ్చాయేమో గానీ అవి వచ్చేముందు శరీరంలో చాలా ప్రతి చర్యలు జరిగాయి. రక్తం వేడెక్కింది గుండెవేగం పెరిగింది. మనసు ఆవేశపడింది. మా చక్రాల పెట్టెలతో మేము నడుచుకుంటూ పోయినా లాంచీలరేవు చేరడానికి అర్థగంట కూడా పట్టదు. చెప్పుకోదగ్గ ఎత్తూలేదు. నా కోపాన్ని అతికష్టంమీద ఉపసంహరించుకుని—శ్రీమతితో—“పదండిపోదాం” అన్నాను.

అన్నదే తడవుగా పిల్లలు ఈ అవకాశంకోసమే ఎదురుచూస్తున్నట్లు చెరో పెట్టెనీ బరబర లాగసాగారు. అంతా బయల్దేరాం.

“అలా వెళ్ళిపోతారేమండీ – ఎంతిస్తారో చెప్పండి” అన్నాడు రిక్షా అతను.

“రిక్షా అక్కర్లేదులే” అన్నాను సాధ్యమైనంత తాపీగా.

“మీరెంతిస్తారో చెప్పండి—ఇష్టమైతే కడతాం లేకపోతేలేదు” అన్నాడు రిక్షా అతను.

ఆ సమయంలో నాకు దోపిడీ చేసేవర్గం వాడిదీ—దోచబడుతున్నది నేనూ అనిపించింది. అందుకే “రిక్షా అక్కర్లేదన్నాగా” అన్నాను.

“అక్కర్లేకపోతే ఎందుకడిగారు?” అతను ప్రశ్నవేశాడు.

“పోనీ సరదాగా రిక్షా ఎక్కుదాం అనుకుని అడిగాను” అన్నాను కోపంగా.

“సరదాగా రిక్షా ఎక్కాలనుకుంటే అయిదు రూపాయలవుద్దండి” అన్నాడతను.

దెబ్బ తినేశాను. అతనంత తెలివిగా మాట్లాడతాడనుకోలేదు. కోపంగా ముందుకు నడిచాను. స్టేషన్ ఆవరణలోంచి రోడ్డుమీదకు రావడానికి పదడుగులు చాలు. అక్కడ రిక్షాకు రూపాయన్నర చొప్పున బేరం దొరికింది. అయితే రిక్షా పొడుగునా నేనో విషయానికి ఆవేశపడుతూనే—‘ అప్టరాల్ రిక్షా వాడు నన్నంత మాటంటాడా ?” అనుకున్నాను. నా ఆవేశం సంగతి తెలియని శ్రీమతి “ఏమిటండీ అలా ఉన్నారు?” అంది. ఆమె నాకూ రిక్షా అతనికీ జరిగిన సంభాషణ వినలేదు. నేను చెప్పగా విని “అంత మంచి జోకు వేసినందుకు హృదయపూర్వకంగా అభినందించాలతన్ని. మీలో బొత్తిగా స్పోర్టివ్‌నెస్‌లేదు” అంది.

అప్పటికి నా సెన్సాఫ్ హ్యూమర్ పనిచేసింది. స్నేహితుల్లో చాలాసార్లు ఒకరిమీద ఒకరు జోకు వేసుకుంటూంటాం. ఒకోసారి జోకు బాగా పేలితే తిప్పి కొట్టడానికి ప్రయత్నించకుండా జోకుని మెచ్చుకుంటాం. మరి ఈ రిక్షా అతన్నికూడా నా స్నేహితుడిలాగే ఎందుకు భావించకూడదూ ?

రిక్షా అతను నాకు స్నేహితుడా ?...ఈ ఆలోచన నాకు నచ్చలేదు. కానీ నాలోని సంస్కారం పదే పదే నన్ను హెచ్చరించసాగింది. నాలోని రచయిత కూడా పని చేయసాగాడు.

రిక్షావాళ్ళను దోపిడీకి గురవుతున్న వర్గానికి చెందినట్లు చాలామంది రచయితలు రాస్తూంటారు. వాళ్ళ జీవన విధానం గురించి అట్టే పట్టించుకోని నేను—వాళ్ళగురించి అదే అభిప్రాయంలో ఉన్నాను. రేడియోలు, సినిమాలు, వార్తాపత్రికలు వాళ్ళలోనూ అవగాహనను పెంచుతున్నాయి. వాళ్ళు నేను వేసేలాంటి బట్టలు వేసుకోకపోవచ్చు. నేను వెళ్ళే ఖరీదైన హోటల్స్‌కి పోకపోవచ్చు. అయితే తేడా అక్కడితో ఆగిపోతోంది, డబ్బు ఒక్కటే మా ఇద్దరికీ రెండు రకాల ఆకృతులిచ్చింది. కానీ మనిషి మనసుపరంగా చూసుకుంటే – ఇద్దరం ఒక్కటేనని ఈ సంఘటన నాకు తెలియబర్చింది. ఒక విధంగా ఇది నాకు సంతోషాన్ని కలిగించింది. ఈ వర్గానికి మానసిక వికాశం రావాలనీ, తమ పై వర్గాలను త్వరగా కలుసుకోవాలనీ నా కోరిక! అప్పట్నించీ వాళ్ళను నేను మరికాస్త జాగ్రత్తగా పరిశీలించసాగాను.

మరోసారి నాకు ఇలాంటి అనుభవం భువనేశ్వర్లో జరిగింది. అక్కడ ప్రతి ఆదివారం మేము తెలుగు సినిమాలు చూస్తూంటాం. నగరానికి మధ్యలో ఉన్న ప్రియా టాకీసులో ప్రతి ఆదివారం మధ్యాహ్నం పన్నెండు నించి మూడు వరకూ తెలుగు సినిమా ఉంటుంది. సోమ, మంగళ, బుధవారాల్లో కూడా ఉంటుంది కానీ మాకు ఆదివారం మాత్రమే సెలవు. రిక్షావాళ్ళు చాలామంది తెలుగువాళ్ళు.

ప్రియా టాకీసు నుంచి మేముండే కాలనీకి

వెళ్ళడానికి సరైన బస్సు సదుపాయం లేదు. అవి ఎప్పుడో వచ్చిపోతూంటాయి. సినిమా కాగానే వెంటనే ఇంటికి పోవాలంటే రిక్షా ఎక్కడమే మంచిది. అయితే అక్కడికి మా కాలనీ చాలా దూరం. మా కాలనీ విసిరేసినట్లు ఊరికి చివరగా ఉంటుంది. అక్కణ్ణించి తిరుగు బేరాలు దొరకవని రిక్షా వాళ్ళెవరూ రావడాని కిష్టపడరు. చాలామంది రామనే చెబుతారు. అలా అనడం ఇష్టంలేనివాళ్ళు ఎక్కువ ధర చెబుతారు. అవి వచ్చే బేరాలు కావని వెంటనే తెలిసిపోతుంది.

ఓ రోజు సినిమా చూసి రిక్షా బేరమాడాను. సాధారణంగా మా కాలనీకి ఎండ, గాలి వాటాన్ని బట్టి రెండున్నర లేక మూడు రూపాయలిస్తాం. రిక్షా అతను ఆర్రూపాయలడిగాడు.

"ఇది వచ్చే బేరం కాదు పమా" అన్నాను నా కసిని ఉచ్ఛారణలో చూపిస్తూ.

రిక్షా అతను కాస్త తగ్గి — "ఏమిస్తారో చెప్పండి బాబూ" అన్నాడు.

ఆర్రూపాయలడిగాడని నాకు చాలా మంటగా ఉంది. అందుకని ఇంకా కసిని ఉచ్ఛారణలో చూపిస్తూనే — "రూపాయిస్తాను — వస్తావా!" అన్నాను.

దానికి వాడు అది చాలా అన్యాయమని అంటాడనీ, అప్పుడు నేను నువ్వు ఆర్రూపాయ లడగడం బాగుందా అని దులిపేయొచ్చుననీ అనుకున్నాను. అయితే నా అంచనా తలకిందులైంది. అతను తన తోటి రిక్షావాడితో — "అబ్బే - ఇది ఎక్కే బేరం కాదురా" అన్నాడు.

నాకు కోపం రాబోయి ఆగిపోయింది. ఎంత తెలివిగా దెబ్బకొట్టాడు? తెలివి ఏ ఒక్కరి సొత్తూ కాదు. కానీ తెలివితేటల్లో నా స్థాయికి తీసిపోకుండా వీరున్నారని కాస్త ఆనందం కలిగింది.

అయితే నా ఆనందాన్ని వెంటనే ప్రకటించ లేదు. అక్కణ్ణించి నేనూ, శ్రీమతీ కదిలాం. ఓ రిక్షా అతను మా పక్కకొచ్చి "నాల్రూపాయ లివ్వండి బాబూ" అన్నాడు.

"మూడు రూపాయలిస్తాను" అన్నాను.

అతను రాలేదు. మేము నడుస్తూ వెడుతున్నాం. రిక్షా అతను మా వెనకే వస్తూ — "మూడున్నర" అన్నాడు. మూడంటే మూడేనన్నాను నేను. అలా కొంత దూరం వెళ్ళాక — పోనీ మూడుంపావలా ఇప్పించమని అడిగాడతను. రిక్షావాళ్ళ విషయంలో ఒకోసారి చాలా పట్టుదల వచ్చేస్తుంది నాకు. అతనికేసి చూడనైనా చూడకుండా ముందుకు ప్రొసీడయ్యాం.

మరికాస్త దూరం వెళ్ళాక—"సరే — ఎక్కండి బాబూ" అన్నాడు రిక్షా అతను.

అప్పటికి నేను జరిగింది గ్రహించాను. ప్రియా టాకీసు నుంచి ఓ అరకిలోమీటరు దూరం వరకూ బాగా ఎత్తు ఉంది. అక్కణ్ణించి కొంత సమతల ప్రదేశం. ఆ తర్వాత డౌను. టాకీసు దగ్గర ఎత్తు ఎక్కించడం చాలా కష్టం. అందుకని రిక్షా అతను తెలివిగా బేరాల వంకపెట్టి ఈ ఎత్తు గడిపేశాడు. ఇది గ్రహించగానే నాకు చాలా ఉక్రోషం వచ్చింది.

"ఇక్కణ్ణించయితే రెండున్నరే ఇస్తాను" అన్నాను.

రిక్షా అతను నాకేసి అదోకలా చూసి — "అలా నడుచుకుంటూ వెళ్ళిపోండి. ఏమీ ఇవ్వకుండానే ఇల్లు చేరొచ్చు" అంటూ రూంమ్మని రిక్షా తొక్కుకుని వెళ్ళిపోయాడు. ఆ దెబ్బనుంచి తేరుకోడానికి నాకు అయిదు నిముషాలు పట్టింది.

ఈ సంఘటనలు నాకు రిక్షావాళ్ళని నాతో సరిసమానులుగా చూడమని హెచ్చరించాయి. మా కాలనీకి ఎప్పుడు రిక్షాలో వెళ్ళినా రిక్షా అతనికి — చల్లటి ఐస్ వాటరు ఇచ్చేవాళ్ళం. ఇంట్లో ఏమైనా తినేది ఉంటే పిల్లలకు పెట్టమని ఇచ్చేవాళ్ళం. ఒకోసారి బట్టలుకూడా ఇస్తూండేవాళ్ళం. ఇలా చేయడంతో కొందరు రిక్షావాళ్ళు మాకు స్నేహితులు కూడా అయ్యారు. ఎన్నో అనవసరపు ఖర్చులు చేస్తూండే నేను వాళ్ళ గురించి పావలా, అర్ధా బేరాలాడడం మానేశాను.

రిక్షావాళ్ళలో నాకు చాలా తమాషా అయిన వ్యక్తులే తగిలారు.

ఒకతను ఎవరో ఒకాయన కూతురు చావు బ్రతుకుల్లో ఉంటే రక్తదానం చేశాట్ట. ఆ తర్వాత ఆయన ఎమ్మెల్యే అయి అతనికో వాచ్‌మన్ ఉద్యోగం ఇప్పించాట్ట. ఆ ఉద్యోగంమీద వచ్చే జీతంలో మూడొంతులు ఇంటికి పంపించేస్తాట్ట — చెల్లెమ్మ పెళ్ళికోసం. మిగతా డబ్బుతో తన తిండి వెళ్ళి పోతుందట. పై ఖర్చులకోసం రిక్షా తొక్కుతాడట - "నాకు సినిమా పిచ్చి బాబూ—అందుకయ్యే ఖర్చంతా నేను రిక్షామీదే సంపాదించుకుంటాను" అని చెప్పాడు. ఇటీవలే ఆ ఎమ్మెల్యే ఏదో మినిస్టరయ్యాడుట కూడా — "మీకేమైనా పన్లుంటే నాతో చెప్పండి. చిటికెలమీద అయిపోతాయి" అని చెప్పాడు.

మరో రిక్షా అతను వ్యాపారం చేసేవాడట. పదిరూపాయల పెట్టుబడిని మూడువేలు చేశాడట— "అక్కడ నా ఆశ పెరిగిపోయింది బాబూ—ఒక్కసారి పెద్దెత్తుకు వెళ్ళిపోయాను. ట్రక్కునిండా బంగాళా దుంపలు, ఉల్లిపాయలూ వేసుకుని వస్తూంటే దార్లో వర్షం కొట్టేసి సరుకంతా పాడైపోయింది. ఆ నష్టం తట్టుకోలేక, అక్కడ నలుగురిలో ముఖం చూపించలేక ఇక్కడికొచ్చి రిక్షా తొక్కుతున్నాను" అన్నాడు. రిక్షా స్వంతం. అతనికి తాగుడు అలవాటు లేదుట. రెండేళ్ళనుంచి భువనేశ్వర్లో రిక్షా తొక్కుతూ ఇప్పటికి రెండువేలు వెనకేశాడట. అతడి పెళ్ళాం డబ్బును వడ్డీకి తిప్పుతుందట. డబ్బును తొందరగా అయిదువేలుచేసి మళ్ళీవ్యాపారానికి వెళ్ళిపోతానన్నాడు. రిక్షా తొక్కడం ఏ జన్మలోనో చేసిన పాపమనీ, పేగులు తెగిపోతాయనీ అతనన్నాడు. సాటి రిక్షావాళ్ళని అతను తిట్టాడు — "ఎవనికి బుద్ధిలేదండి. సంపాదించిన డబ్బు తాగి తగలేసు కుంటారు. జాగ్రత్తగా ఉంటే గవర్నమెంటు గుమాస్తాకంటే ఎక్కువే సంపాదించొచ్చు. కానీ వాళ్ళకు కుటుంబం ధ్యాసే ఉండదు. అందుకే వాళ్ళెలా బ్రతుకుతున్నారో — వాళ్ళపిల్లలూ అలాగే బ్రతుకుతారు. నేను ఛస్తే నా పిల్లలను రిక్షా తొక్కనివ్వను" అన్నాడతను.

నాకెంతో సంతోషం కలిగింది. ఇదే చైతన్యం అట్టడుగు వర్గంలో రావాలి. ఇలాంటివాడు

ఇంటర్మీడియేట్
మొదటి
సంవత్సరంలో

బయోలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఇంగ్లీష్, మాథమేటిక్స్ చదివే విద్యార్థుల చక్కటి భవిష్యత్తు కోసం మా బడి, పాఠశాల పత్రికలు తీసుకొస్తున్న విజయవాణి. పబ్లిషర్స్, చౌడేపల్లెవారు ఈ విద్యాసంవత్సరంలోకొత్తగా నిర్మిస్తున్నమరోవిద్యాసోపానం

విద్యానికేతన్

ఆగష్టు నుండి నెలనెలా వెలువడుతుంది. విడిప్రతి వెల రూ. 3-50 సంవత్సర చందా: రూ28/- చందాదారులకు ఫిజికల్ మరియు బయోలాజికల్ సైన్సెస్ ప్రాక్టికల్ గైడ్స్ ఉచితంగా యివ్వబడుతాయి.

చందా పైకం పంపాల్సిన చిరునామా :

విజయవాణి, పబ్లిషర్స్,
చౌడేపల్లె-517257

ఏజన్సీ వివరాలకు

మార్గదర్శి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్

ఈనాడు కాంపౌండ్,
సోమాజిగూడ,
హైదరాబాదు-4

ఒక్కడుంటేచాలు. వాణ్ణిచూసి మరికొందరు నేర్చుకోకపోరు. అతన్ని నేను మనస్ఫూర్తిగా అభినందించాను. అప్పుడు తగిలింది నాకు అనుకోని అసలైన అఘాతం.

"మీవాళ్ళెవరైనా ఉంటే చెప్పండి బాబూ – నెలకు ఎనిమిదొందలు దొరికే ఉద్యోగం ఇప్పిస్తాను" అన్నాడతను.

నేనులిక్కిపడి–"ఉద్యోగమంటే ?" అన్నాను.

"మరీ పెద్ద చదువులక్కర్లేదండి – రాయడం చదవడం బాగా రావాలి. ప్రెస్సులో పని. ముందు నెలకు నూటయాభై ఇస్తారు. ఓ ఏడాది తర్వాత నెలకు మూడొందలిస్తారు. ఇంకో ఏడాది పోయాక నెలకు ఎనిమిదొందల జీతం ఇస్తారు. నేనిప్పుడు నెలకు ఆరొందలకు తక్కువకాకుండా సంపాదిస్తున్నాను. ఈ సంపాదన లేకుండా నేను ఒక్క నెల కూడ తట్టుకోలేను. అందుకే నేనా ఉద్యోగానికి పోవడంలేదు. ఆయనకు నేనంటే చాలా ఇష్టం. నువ్వు రాకపోతే నీకు తెలిసినవాళ్ళెవరికైన చెప్పు. నువ్వు చెప్పినవాళ్ళకే ఇస్తానన్నా అన్నాడు. మీబోటి గాళ్ళ ఇళ్ళలో ఏ సంపాదనా లేకుండా ఏళ్ళతరబడి ఉన్నా గడుస్తుంది. మీలాంటివాళ్ళకిది మంచి ఉద్యోగం. మీవాళ్ళెవరైనా ఉంటే చెప్పండి బాబూ" అన్నాడు.

ఒక రిక్షావాడు మావాళ్ళకుద్యోగం ఇప్పిస్తానంటున్నాడు. నెలకు రెండు వేలు సంపాదించే పెద్ద ఆఫీసర్ని - నా చుట్టాలకి – ఆఫ్టరాల్... ఓ రిక్షావాడు .

నాలోని రచయిత ఈ ఆలోచనల్ని తొందరగానే నొక్కేశాడు. రిక్షా అతని మాటల్లో మధ్యతరగతికి ఓ గొప్ప సందేశమున్నదనిపించింది. మధ్యతరగతి వాళ్ళు ఏ సంపాదనా లేకుండా ఏళ్ళతరబడి ఉండిపోతారు. కారణం ఎలాగో అలాగ ఇంతో అంతో తిండీ బట్టా దొరికే ఆధారముండడం. అదే సదుపాయం అట్టడుగు వర్గానికి లేదు. అందుకే వాళ్ళు కాయకష్టం చేసి తమ కాళ్ళమీద తాము నిలబడగల్గుతున్నారు ఓ వయసొచ్చేక పిల్లల్నింట్లోంచి గెంటేసి మీ దారిన మీరు బ్రతకండి అంటె నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందా ? సమస్యకు పరిష్కారం లభించినా లభించకపోయినా ఇందులో మధ్యతరగతి నిరుద్యోగులు సిగ్గుపడవలసిన అంశం ఉన్నదని నాకు తోచింది.

అట్టడుగు వర్గం ప్రజల గురించి నాకు తెలుసుకునే అవకాశం అట్టే లేదు. ఒక్క రిక్షా వాళ్ళు మాత్రమే నాకు దొరుకుతారు. నాకు తగిలిన వాళ్ళనుబట్టి వాళ్ళలో చైతన్యం వస్తున్నదనే నాకు అనిపిస్తోంది. అలాంటప్పుడు నేనొక వింత ప్రయోగం చేశాను.

ఓ రోజున నేనూ, శ్రీమతి రిక్షాలో సినిమా టాకీసుకి వెళ్ళాం. రెండున్నర ఇవ్వాలి. రిక్షా థియేటర్ చేరేక – "బాబూ – నాలుగు రూపాయ లివ్వండి. సినిమా అయే టైముకి వచ్చి మీకు డబ్బులిచ్చేస్తాను. అర్జంట్‌గా బియ్యం కొని ఇంట్లో ఇవ్వాలి" అన్నాడు రిక్షా అతను

శ్రీమతి వద్దని నాకు గోకి చెప్పింది. నేను మాత్రం రిక్షా అతను కోరిక ప్రకారం డబ్బిచ్చి – "సినిమా అయిపోగానే వచ్చేయాలి. మేము నీకు బాగా గుర్తుంటామా ?" అన్నాను.

"అదేంటి బాబూ – మీకు చాలాసార్లు రిక్షా కట్టాను. మీరు నాకు బాగా గుర్తు. `అడగ్గానే నన్ను నమ్మి డబ్బులిచ్చారు. మిమ్మల్ని మోసంచేసి నేను బాగుపడతానా ?" అన్నాడు రిక్షా అతను.

అతను బాగుపడినా పడకపోయినా – ఆ రూపాయన్నరతో నేను చెడిపోను

"సినిమాకంటె గొప్ప సస్పెన్స్. అతనొస్తాడో రాడో చూడాలి" అన్నాను.

శ్రీమతికి నా వ్యవహారం నచ్చలేదు-"తెలుగు సినిమా సస్పెన్సులాగుంది మీరు చెప్పేది. అతనింకా మళ్ళీ మీ కళ్ళబడతాడనే అనుకుంటున్నారా ?" అంది.

సినిమా చూస్తూ నేనీ విషయం మరచిపోయాను. కానీ సినిమాలో విషాద సన్నివేశం వచ్చినపుడల్లా శ్రీమతికి నా తెలివి తక్కువతనమూ, ఆ రూపాయిన్నరా గుర్తుకొచ్చి బాధపడేది. సినిమా నిండా విషాద సన్నివేశాలుండడం వల్ల ఆమె సినిమా పొడుగునా బాధపడుతూనే ఉంది. రూపాయిన్నర ఎంత విలువైనదో దాంతో ఆమె ఏమేమి కొనవచ్చునో వివరాలు చెప్పింది. అప్పటికీ శ్రీమతితో అన్నాన్నేను – "నీకు మొన్న కొన్న చీరకు షాపువాడు రెండువందల పదిరూపాయలు ధర చెప్పి మాట తొంభై అయిదుకిచ్చాడు. ఆ చీరకు నూటతొంభై ఆరున్నరయిందనుకో – షాపువాడు రెండొందలంటే రెండొందలూ ఇచ్చి ఉండేవాళ్ళంగదా" అన్నాను నా సూచన శ్రీమతికి నచ్చలేదు. రూపాయిన్నర ఎంత విలువలేనిదో చెబుతూ – ఆమె జాకట్టుకు మొన్న ఇచ్చిన కుట్టుకూలి పదిహేనురూపాయలని కూడా గుర్తు చేశాను. శ్రీమతి అవి వినకుండా – కేజీ బంగాళాదుంపలు, బ్లేడ్సు ప్యాకెట్, జత రిబ్బన్లులాంటివి గురించే ఆలోచిస్తూ అమితంగా బాధపడుతూండగా సినిమా అయిపోయింది.

రిక్షా అతను రాడని శ్రీమతి ఘంటాపథంగా చెప్పినా ఏ మూలో ఆమెలో ఆశ మిణుకు మిణుకుమంటోందనడానికి చిహ్నం, ఆమె ఆత్రుతగా అటూ ఇటూ చూడడం. నేనా రూపాయిన్నర కెప్పుడో నీళ్ళొదిలేశాను. శ్రీమతినే గమనిస్తూ ఆనందిస్తూన్న నన్నూ, శ్రీమతినీ రిక్షా అతను హఠాత్తుగా థ్రిల్ చేశాడు.

అతను రూపాయిన్నర నా చేతికి అందించగానే శ్రీమతి ముఖంలో పశ్చాత్తాప భావం నాకు స్పష్టంగా కనబడింది. నేనా డబ్బు జేబులో వేసుకుంటూ, "వృద్ధిలోకి వస్తావోయ్" అని అతన్ని మెచ్చుకున్నాను.

అతను నాకేసి నిరుత్సాహంగా చూసి "మీకు ఆవు – పులి కథ తెలుసా బాబూ !" అన్నాడు.

ఆవు, పులి అసలు కథేకాకుండా, బీనాదేవి రాసిన కథకూడా తెలుసు నాకు. రిక్షా అతని దగ్గర బీనాదేవి పేరు చెప్పడమెందుకూ అని, "తెలుసోయ్, నువ్వు అందులో ఆవుకంటె గొప్పవాడివి" అన్నాను.

"కానీ మీరు..." అని రిక్షా అతను ఆగిపోయాడు. అతనేమనదల్చుకున్నాడో నాకు తెలుసు. చటుక్కున జేబులోంచి రెండ్రూపాయల నోటు అతని చేతిలో పెట్టి — "నేనిప్పుడు పులికంటే గొప్పకదా !" అని ముందడుగు వేశాను.

"మరో అర్ధరూపాయ నష్టం" అంది శ్రీమతి నాతో అడుగు కలుపుతూ.

"ఏం ఫరవాలేదు. నీ చీర ఖరీదు ఇంకా నూటతొంభై ఏడే అయింది. కానీ రెండొందలు చేరలేదు" అన్నాను.

"అయిందేదో అయిపోయింది కానీ ఇంకెప్పుడూ రిక్షావాళ్ళతో చనువుగానూ, సఖ్యంగానూ ఉండకండి. నా కంటికి వాళ్ళంతా పులులుగానూ — మీరు ఆవులాగానూ కనిపిస్తున్నారు" అంది శ్రీమతి.

కాస్త ఆలోచిస్తే నిజమేనేమోననిపించింది. తర్వాతనుంచీ శ్రీమతి చెప్పినట్టే నడుచుకున్నాను రిక్షావాళ్ళ విషయంలో.